C.P. Brown ACADEMY **సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో**

**ప్రథమ బహుమతి రూ. 10,000 పొందిన కథ**



రాత్రి పదిన్నరకు కుమార్ నుంచి ఫోనొచ్చింది. ''నువ్వు వెంటనే బయల్దేరి విశాఖ వచ్చేయి'' అన్నాడు. గొంతులో ఉద్విగ్నత వల్లనుకుంటాను మాట స్పష్టంగా విన్పించలేదు. ఎప్పుడూ ప్రశాంతంగా, నింపాదిగా మాట్లాడే కుమార్....అంత ఎక్జయిట్ కావడం నేనెప్పుడూ ఎరుగను. నాతో పాటు ఆంధ్రా యూనివర్శిటీలో పర్యావరణ శాస్త్రాన్ని చదివి, రీసెర్చి పూర్తయ్యాక అక్కడే లెక్చరర్‌గా స్థిరపడ్డాడు. నేను సైంటిస్ట్‌గా పర్యావరణ పరిరక్షణ కోసం నా వంతు కృషి చేస్తున్నాను.

''ఏమిటీ విషయం?'' అన్నాను.

# ప్లాట్ ఫామ్ బిన్ని

## - సలీం

''మెల్లగా అంటావేమిటి....పెద్ద విశేషం.... నా స్టూడెంట్స్‌కి అరకులోయలో బట్టమేక పక్షి కన్పించిందట. వెంటనే బయల్దేరు. నేనీ రోజే బయల్దేరి అరకు వెళ్తున్నా. గెస్ట్ హౌస్ బుక్ చేశాను. దాన్ని మళ్ళా నా కళ్ళతో చూసే వరకు మనశ్శాంతి ఉండదు'' అన్నాడు.

అతని మాటలు విన్నాక నేనూ విపరీతమైన ఉద్విగ్నానికి లోనైనాను.

''నిజంగానా...వాళ్ళేమీ పొరపాటు పళ్ళేదు కదా''

''నో ఛాన్స్...వాళ్ళు నా విద్యార్థులు'' అన్నాడు. అతని గొంతులో ధ్వనించిన అచంచలమైన ఆత్మవిశ్వాసం...ఎంఎస్సీ పర్యావరణ శాస్త్రంలో గోల్డ్‌మెడలిస్ట్ అతనే మరి.

బట్టమేక పక్షి...గ్రేట్ ఇండియన్ బస్టర్డ్...పిహెచ్‌డిలో నా రీసెర్చి టాపిక్ అదే...ప్రస్తుతం అంతరించిపోతున్న జీవజాతుల్లో బట్టమేక పక్షి కూడా ఒకటి. పులికాట్, కొల్లేరు, నీలపట్టు సరస్సుల వద్దకు ప్రతియేటా అక్టోబర్, నవంబర్ మాసాల్లో వందల సంఖ్యలో వలస వచ్చే ఈ పక్షి రానురాను కనుమరుగైంది. మనుషులు తమ ఆహారం కోసం వీటిని వేటాడడం, పర్యావరణ కాలుష్యం, కర్బన ఉద్గారాలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు...కర్ణుడి చావుకు కారణాల్లా...ఈ పక్షి అదృశ్యం కావడం వెనక ఎన్ని కారణాలో....

యాభయ్యవ దశకంలో పర్యావరణ వేత్తలకు కర్నూల్లో కనిపించిన ఈ పక్షి మరలా ముప్పయ్యేళ్ళ విరామం తర్వాత రొల్లపాడు అనే గ్రామంలో మనుషుల కంట పడింది. అంటే కుమార్ చెప్పింది నిజమే అయితే రొల్లపాడులో కన్పించాక మరో ముప్పయ్యేళ్ళకు బట్టమేక పక్షిని చూసిన వాళ్ళం మేమే అవుతాం.

ప్రయాణానికి సన్నద్ధమవుతున్నప్పుడు ''రిజర్వేషన్ లేకుండా ఉన్నపళంగా బయల్దేరితే ఇబ్బంది పడ్తారండి'' అంది రాణి. మా పెళ్ళయి పన్నెండేళ్ళు. పెళ్ళయిన కొత్తలో ఓ తల్లి పసిపిల్లాడి గురించి ఆరాటపడ్డట్టు నా గురించి ఆరాటపడితే నవ్వొచ్చేది. ఇప్పటికీ అంతే. మారలేదు.

''పర్లేదులే. ఉదయం విజయవాడ వెళ్ళే ఇంటర్ సిటీ ఉందిగా. ఎక్కేస్తాను. పన్నెండుకల్లా విజయవాడ చేరుకుంటాను. మరో రెండు గంటల్లో వైజాగ్ వెళ్ళే ఇంటర్ సిటీ ఉంది. నో ప్రాబ్లెం''

''మధ్యాహ్నం భోజనం సంగతేం చేస్తారు? స్టేషన్లో పెట్టే తిండి బావుండదండి. మీకు సరిపడదు. ఆరోగ్యం పాడవుతుంది. క్యారియర్ కట్టిస్తాను'' అంది రాణి.


''ఎందుకురా అబ్బాయ్...మా తులసి పిన్ని ఉండేది విజయవాడేగా. ఫోన్ చేసి చెప్తే చాలు రెక్కలు కట్టుకుని స్టేషన్లో వాలిపోతుంది. కమ్మటి భోజనం తయారు చేసుకుని తెస్తుందిలే. తులసి పిన్ని చేతి వంట మహా రుచిగా ఉంటుందని మన బంధువులందరూ చెప్పుకుంటారు.''

విజయవాడలో తులసి అనే ఒకావిడుందని, అమ్మకు పిన్ని అవుతుందని మొట్టమొదటి సారి విన్న నేను ''ఇంతకు ముందెప్పుడూ ఈ పిన్ని గురించి చెప్పలేదేంటమ్మా'' అని అమ్మనడిగా.

''పిన్ని అంటే స్వంతం కాదులేరా...ఏదో దూరపు చుట్టరికం. పిన్నంటే నాకంటే వయసులో పెద్దదనుకునేవు. చిన్నా పెద్దా అందరూ ఆవిణ్ణి పిన్ని అనే పిలుస్తారు. నాకూ అలా అలవాటైంది. విజయవాడ మీదుగా మనవాళ్ళెవరైనా వెళ్తుంటే, ఏ మధ్యాహ్నానికో, రాత్రి భోజన సమయానికో రైలు స్టేషన్ చేరేలా ఉంటేనే ఈవిడ అందరికీ గుర్తొస్తుంది.''

''అదేంటి?''

''అంతేరా...తులసి పిన్నికి కొద్దిగా చాదస్తంలే. చుట్టుపక్కల పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిగితే ఇళ్ళకెళ్ళి వంటలు చేసి పెడ్తుంది. ఎవరైనా తెల్సిన వాళ్ళు విజయవాడ మీదుగా వెళ్తున్నారని కబురందితే చాలు భోజనాలు చేసుకు వచ్చి ట్రయిన్లో వాళ్ళకి అందిస్తుంది. సమయం దొరికితే దగ్గరుండి తినిపిస్తుంది కూడా. అందుకే ఆవిణ్ణి అందరూ ప్లాట్ ఫాం పిన్ని అని చాటుగా చెప్పుకుని నవ్వుకుంటారు.''



అంత ఉదారత్వం, బంధుప్రీతి చూపించే వ్యక్తిని చూసి నవ్వుకోవటం ఏమిటో...తాము చెయ్యలేకపో తున్న మంచి పనిని ఆమె చేస్తోందన్న గిల్టీ ఫీలింగ్ నుంచి తప్పించుకోడానికి కప్పుకునే ముసుగేమో...

మరునాడుదయం ట్రయిన్లో కూచున్నప్పటి నుండి ఉత్సుకత...విజయవాడ ఎప్పుడెప్పుడు వస్తుం దా...తులసి పిన్నిని ఎప్పుడు కల్సుకుంటానా అని...

"తులసి పిన్ని వెయిటింగ్ రూం దగ్గర నిలబడి ఉంటానంది. గుర్తు పట్టడం సులభం. చేతిలో టిఫిన్ క్యారియర్ పట్టుకుని నిలబడి ఉంటుంది" అంది అమ్మ.

బండి విజయవాడ చేరుకునేటప్పటికి సమయం పన్నెండున్నర అయింది. ఒకటో ప్లాట్‌ఫాం మీదున్న వెయిటింగ్ రూంని వెతు క్కుంటూ నడుస్తున్నా. రెండో తరగతి ప్రయాణీ కుల విశ్రాంతి గది తలుపుకి వారగా నిలబడి ఉందామె. కుడిచేతిలో నాలుగు గిన్నెల స్టీల్ క్యారి యర్, ఎడం చేతిలో ఖద్దరు సంచీ, అరిటాకులు పట్టుకుని తన ముందు నుంచి వెళ్తోన్న వ్యక్తుల వైపు ఆసక్తిగా చూస్తోంది.

నేను తనకు దగ్గరగా వెళ్ళి నిబడి "తులసి పిన్నీ" అన్నాను.

ఆమె మొహం విప్పారింది. కళ్ళు సంతోషంతో తళతళలాడాయి. "నువ్వేనా మా సుధక్క కొడు కువి" అంది కుడిచేతిలో ఉన్న క్యారియర్ని కింద పెట్టి, నా చేతిని ఆప్యాయంగా పట్టుకుని.

తులసి పిన్నికి వయసు యాభైకి దగ్గరగా ఉంటుంది. మనిషి పొడవు కాదు. అలాగని పొట్టి కాదు. ఓ మోస్తరుగా ఉంది. మనిషి రివటలా ఉంది. వంటలు చేసి పొట్టపోసుకోవాలిగా. నిరం తర శ్రమ వల్ల వళ్ళు చేసి ఉండదు. ఆమెలో చప్పున నన్నాకర్షించిన విషయం ఆ వయసులో కూడా ఉర కలేస్తున్న ఉత్సాహం...దుమికే జలపాతంలా...ఉరికే గోదారిలా...

"సుధక్క ఎలా ఉంది? నన్నెప్పుడైనా గుర్తు చేసుకుంటూ ఉంటుందా? ఎందుకుండదూ.....నే నంటే అక్కకి ఎంత అభిమానమో...ఎప్పుడో పది హేనేళ్ళ క్రితం రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్తున్నారని కబురు పెడ్తే ఇదిగో ఇక్కడే ఈ ప్లాట్‌ఫాం పైనే కలిశాను. మీ నాన్నగారు కూడా ఉన్నారు. పులిహోర, దద్దోజనం చేసుకొని తీసుకొ చ్చాను. ఆ తర్వాత కబురూ కాకరకాయ ఏవీ లేవు. మళ్ళా ఇన్నాళ్ళకి మీ అమ్మకి నేను గుర్తొచ్చినందుకు సంతోషం నాయనా." అంటూ చీర చెంగుతో కన్నీళ్ళు వత్తుకుంది. స్టీల్ క్యారియర్ చేత్తో పుచ్చుకు న్నాను. చాలా బరువుగా ఉంది. అనువుగా ఉన్న చోటు చూసుకొని కూచున్నాం.

"పిన్నీ...క్యారియర్ ఇంత బరువుంది. నేనొచ్చేవ రకు కింద పెట్టి నిలబడొచ్చుగా, చేతిలో పట్టుకునే నిలబడ్డావెందుకు? నొప్పి వేయలేదూ" అన్నాను.

"క్యారేజి చేతిలో లేకపోతే నువ్వెక్కడ గుర్తుపట్ట కుండా వెళ్ళిపోతావోనని భయపడ్డాను నాయనా. వంద రూపాయలు పెడ్తే చాలు మంచి హోటల్లో నాలుగు కూరల్తో భోజనం దొరుకుద్ది. పెద్ద ఉద్యోగ స్తుడివి. నీకా స్థోమతుంది. కానీ నీకోసమని శ్రద్ధగా వండుకుని తెచ్చిన భోజనం నీకు తిన్పించకపోతే నాకు మనసు అల్లాడిపోతుంది. నాకీపాటి మన శ్శాంతి దొరికేది నా అనేవాళ్ళకి కడుపు నిండా తిండి పెట్టిన రోజే నాయనా...ఎప్పుడో తప్ప నన్ను తల్చు కోరు. మన చుట్టాలు బంధువులు...అటువంటి అవ కాశం కోసం తహతహలాడిపోతుంటాను తెలు సా...రాక రాక మా సుధక్క కొడుకొస్తే ఆ అవకా శాన్ని జారవిడుచుకుంటానా?" అంది.

అరిటాకుని కడిగి నా ఎదురుగా పర్చింది. స్టీల్ క్యారేజీ విప్పి గిన్నెలు చుట్టూ పెట్టింది. సంచిలోని హాట్ ప్యాక్‌లో తెచ్చిన వేడి వేడి అన్నం...గోంగూర పప్పు....బంగాళాదుంప వేపుడు...నిమ్మకాయ చారు, మజ్జిగ మిరపకాయలు...గడ్డపెరుగు. అంత రుచికరమైన భోజనం నేనెప్పుడూ తినలేదు. ఎంత ఆప్యాయంగా తిన్పించిందో...కొసరి కొసరి...క మ్మటి కబుర్లతో కలిపి...ఆమె ప్రతి మాటా తీయటి అనుబంధాల ఊట...

"ఎప్పుడో చిన్నప్పుడు చూశాను నిన్ను...ఎంత పెద్దవాడివైపోయావో...పెద్ద సైంటిస్ట్‌వైనావని అక్క చెప్పింది. ఇంకా గొప్ప వాడివై మంచి పేరు తెచ్చుకో నాయనా. ఎంత ఎత్తుకి ఎదిగినా ఈ పిన్నిని మాత్రం మర్చిపోకు. నేను బతికేదే మీ ప్రేమలూ ఆప్యాయతల కోసం..." అంది తను తెచ్చిన సీసాలోని నీళ్ళు అందిస్తూ....ఆమె కళ్ళు మరలా చెమ్మగిల్లాయి.

నగర జీవితంలోని హిపోక్రసీ...ప్లాస్టిక్ నవ్వు లు...హృదయంలోంచి గాక పెదాల మీంచి దొర్లే మాటలు గుర్తొచ్చాయి. పరిచయం అయి కొన్ని నిమిషాలే అయినా స్వచ్ఛమైన ప్రేమతో, ఆప్యా యంగా మాట్లాడిన తులసి పిన్నంటే చాలా ఇష్టమే ర్పడింది. అనుబంధాలకి బంధుత్వాలు కావాలా... సంవత్సరాల తరబడి పరిచయాలు కావాలా...కావ ల్సింది మనిషితనం కదా. మనిషి మనిషికి బంధువు కాదా, ప్రేమించడానికి అంతకన్నా బల మైన కారణాలు అవసరమా....

వైజాగ్ వెళ్ళే ట్రయిన్ కదిలేవరకు పిన్ని నాతో పాటే ఉంది. గలగలా మాట్లాడుతోనే ఉంది. నాతో మాట్లాడాలనుకున్న వేనవేల విషయాలు ఒక్కటి కూడా పొల్లు పోకుండా చెప్పేయాలనే ఆరాటం... భూమిలోంచి జల ఊరినట్లు ఊరుతున్న కబుర్లు... మాటల ప్రవాహం...

అరకులో కుమార్ అతని నలుగురు విద్యార్థులు నన్ను సాదరంగా ఆహ్వానించారు. ఉదయం లేచిన ప్పటి నుండి బట్టమేక పక్షి కోసం వళ్ళంతా కళ్ళు చేసుకుని చెట్టూ పుట్టా వదలకుండా లోయంతా గాలించడమే పని... ఐదురోజుల తర్వాత నిరాశ లోకి జారుకోబోతున్న తరుణంలో అది కంట పడింది. మా అందరిలోకి కొత్త ఉత్సాహం ప్రవేశిం చింది. దాన్ని ఒడుపుగా పట్టుకుని మరునాడు రొల్ల పాడులో ఉన్న బట్టమేక పక్షుల సంరక్షణ కేంద్రంలో అప్పగించాం. ఓ బృహత్తర కార్యాన్ని సాధించిన తృప్తితో హైద్రాబాద్ తిరుగు ప్రయాణమైనాను.

మళ్ళా నా ఉద్యోగ బాధ్యతల్లో మునిగిపోయినా తులసి పిన్ని మాత్రం పదే పదే గుర్తుకొచ్చి అశాం తిని కలుగచేసేది.

"ఎంత గొప్పవాడివైనా ఈ పిన్నిని మాత్రం మర్చిపోకు నాయనా" అంటూ సజలనయనాల్తో వేడుకున్న తులసి పిన్ని....

ఇహ మనసుని శాంతపర్చడం వశం కాక రెండ్రోజులు శెలవు పెట్టి విజయవాడ బయల్దేరాను. వద్దన్నా వినకుండా తులసి పిన్ని స్టేషన్‌కొచ్చింది. "విజయవాడ పెద్ద ఊరేం కాదుగా పిన్నీ. ఇల్లు కనుక్కోలేనా ఆ మాత్రం" అన్నాను నవ్వుతూ.

"ఊరుకొత్త కదా, ఇల్లు కనుక్కోవడంలో ఇబ్బంది పడ్తావని వచ్చా బాబూ" అందామె.

సత్యన్నారాయణ పురంలోని విశాలమైన ప్రాంగణంలో ఐదు వాటాలున్నాయి. ఓ వాటాలో పిన్ని ఉంటోంది. రెండు పడక గదులు. ఓ కిచెన్, హాలు, ఓ పూజగది... చాలా పొందిగ్గా ఉంది ఇల్లు. ఆ ప్రాంగణంలోని ఐదు వాటాలకి కలిపి ఓ కుళా యితో పాటు, గిలక బావి కూడా ఉంది. రకరకాల పూల మొక్కలు, కూరగాయల మొక్కలు....పెరటి నిండా అరటి చెట్లు.

ఇంట్లో ఒక్కతే ఉంటుందనుకుంటాను. మరో ప్రాణి ఉన్న దాఖలాలేవీ కన్పించలేదు మరి. ఒక్క మనిషి కోసం ఆ ఇల్లు పెద్దదే అన్పించింది. అమ్మని పిన్ని గురించి వివరాలడిగినప్పుడు, "నాకూ



పెద్దగా తెలీవురా అబ్బాయ్... చెప్పాగా చాలా దూరపు చుట్టరికమని. మన గురించి మనం పట్టించుకునే తీరిక దొరకటం లేదు. వేరే వాళ్ళ వివరాలేం తెలుసుకుంటాం?'' అంది.

వెండి పళ్ళెంలో అరిటాకు వేసి కంది పచ్చడి, టమోటా పప్పు, అరిటికాయ వేపుడు,పేరిన నెయ్యితో వేడి వేడి అన్నం పెట్టింది. తృప్తిగా తిన్నాను. భుక్తాయాసం వచ్చేలా...

పడగ్గదిలో ఫ్యాన్ వేసి ''కొద్దిసేపు పడుకొని విశ్రాంతి తీసుకో నాయనా. వెంకట సుబ్బయ్య వాళ్ళింట్లో మనవణ్ణి ఉయ్యాల్లో వేస్తున్నారు. మన పక్క వీధిలో నాలుగో ఇల్లే. యాభై మంది దాకా బంధువులకి భోజనాలు తయారు చేయాలి. వంటలో సాయం చేయమని అడిగారు. పొరుగు వాళ్ళకి ఆ మాత్రం సాయం చేయకపోతే ఎలా చెప్పు. వెళ్ళొస్తాను. బోర్ కొడితే టీవీ పెట్టుకో. తొందరగానే పని తెముల్చుకుని వచ్చేస్తాలే'' అంది.

నిద్ర పట్టలేదు. పిన్ని వెళ్ళిన గంటకి కాలింగ్ బెల్ మోగితే వెళ్ళి తలుపు తీశాను. వచ్చింది పనిమనిషని తెలుసుకుని ఆశ్చర్యపోయాను. పిన్ని వంటలు చేసి బాగా సంపాదిస్తున్నట్లుంది. పనిమనిషిని కూడా మెయిన్‌టెయిన్ చేస్తుంది అనుకొన్నాను. పనిమనిషిక్కూడా దాదాపు తులసి పిన్నంత వయసే ఉంటుంది. అంట్లు తోమి కిచెన్లో సర్దిపెట్టింది. బట్టలుతికి పెరట్లో ఉన్న దండేనికి ఆరవేసి అవి ఎగిరిపోకుండా క్లిప్పులు పెట్టింది.

''పనంతా చేసేశాను. వెళ్తాను బాబూ'' అంటూ వెళ్ళబోయి, ఆగి వెనక్కి తిరిగి, ''ఏ ఊరు బాబూ మీది? అమ్మగారికి బంధువులా?'' అని అడిగింది.

''నాకు పిన్ని వరసవుతుందిలే. నేను హైదరాబాద్ నించి వచ్చాను''

''ఏదైనా పని మీద వచ్చారా?''

''లేదు. పిన్నిని చూసిపోదామనే వచ్చాను.''

ఆ సమాధానం ఊహించలేదో ఏమిటో కొద్దిసేపు నా వైపు ఆశ్చర్యంగా చూసింది. మెల్లగా కదిలి నా దగ్గరగా వచ్చి నిలబడింది.

''ఈ అమ్మ కాడ దాదాపు పదేళ్ళ నించి పన్జేస్తున్నా. ఎవరొచ్చినా వాల్ల వాల్ల పన్ల మీద వచ్చి అమ్మింట్లో తేరగా ఉండి రకరకాల వంటలు అడిగి సేయించుకొని తిని పోయినోళ్ళే తప్ప ఒక్కరైనా అమ్మ కోసం వచ్చిన పాపాన పోలేదు. మీరే మొదటోల్లు బాబూ. ఇన్నాల్లూ అనుకునేదాన్ని, అమ్మ సత్తెకాలపుది. అందర్నీ తనవాల్లనుకుని నమ్మి వాల్లకి సవుకర్యంగా ఉండాలని తెగ ఇదై పోతుంది కదా. ఈ అమ్మ కోసం అచ్చం అమ్మ మీది అబిమానెంతో ఎవర్సయినా రావటం నేను బతికుండగా సూత్తానో లేదోనని. ఇప్పుడు మనసుకి పెశాంతంగా ఉంది. నిన్నా దేముడు సల్లగా సూత్తాడు'' అంది.

''మా పిన్ని వంటలు చేసి బాగానే సంపాయిస్తున్నట్టుందే'' అన్నాను అవకాశం దొరికింది కాబట్టి కొన్ని ప్రశ్నలకైనా సమాధానాలు రాబట్టవచ్చనే ఆశతో.

ఆమె నా వైపు మరోసారి ఆశ్చర్యంగా చూసింది. ''వంటలు చేసి సంపాయించాల్సిన కర్మ ఆయమ్మకేం పట్టింది బాబూ. నూజివీడులో పదెకరాల మామిడితోట ఉంది. ఇక్కడ నిడమానూరులో పన్నెండెకరాల మాగాణి ఉంది. పదేళ్ళ క్రితం పెనిమిటి పోయినా ధైర్నంగా నిలబడి కూతుర్ని డాకటేరు చదివించింది. కూతురూ అల్లుడు అమెరికాలో ఉంటారు. లంకంత ఇల్లు...ఈ పోర్షన్లన్నీ అమ్మగారివే. తనకోసం ఓ పోర్షన్ ఉంచుకుంది అంతే''

ఆశ్చర్యపోవడం నా వంతయింది. ఇన్ని ఆస్తులు పెట్టుకొని హాయిగా కాలు మీద కాలేసుకుని వచ్చే పంటసాయాన్ని, అద్దె డబ్బుల్ని అనుభవిస్తూ కూచోక ఇలా వంటలు చేయడాలు, ట్రెయిన్లో వెళ్ళే వాళ్ళ కోసం క్యారియర్లు మోయడాలు ఎందుకో అర్థం కాలేదు అదే విషయం అడిగాను.

''చెప్పాగా బాబూ పిచ్చమ్మని...అందరికి తన శాతనైనంత సాయం చేయాలంటుంది. అందర్నీ తన వాళ్ళనుకొంటుంది. అమ్మ వంటలు శానా రుచిగా సేస్తుంది. దీన్ని అలుసుగా తీసుకుని వంట వాళ్ళని పెట్టుకుంటే అయ్యే కర్సు మిగులుద్దని అమ్మని పిలుత్తారు. వాల్లు అబిమానెంతో పిలుత్తున్నారని బెమ పడ్తుంది తప్ప ఈమె మంచితనాన్ని అవసరానికి వాడుకుంటున్నారని సెప్పినా ఇన్పించుకోదు'' అంది.

ఆమె వెళ్ళిపోయిన చాలా సేపటి వరకు తులసి పిన్ని గురించి ఆలోచిస్తూ గడిపాను. మానవ సంబంధాలన్నీ డబ్బుతో ముడిపడి ఉన్న ఈ రోజుల్లో ఇంత నిస్వార్థంగా పరాయివాళ్ళ కోసం బతికేవాళ్ళు కూడా ఉన్నారా... ఉన్నారని ఎవరైనా చెప్పినా, పిన్నితో పరిచయం కాకుండా ఉంటే, నేను నమ్మేవాణ్ణి కాదు.

ఏడు గంటలకు హడావిడి పడిపోతూ వచ్చింది. ''ఆకలేస్తోందా... చిటికెలో వండేస్తాను. ఏం కూరలు వండమంటావు? నీకేం ఇష్టమో చెప్పు. వండి పెడ్తాను'' అంటూ వంటగదిలోకి దూరింది.

ఆమె మొహంలో అలసట కన్పిస్తోంది.

''ఇప్పటి దాకా కష్టపడి వచ్చావు కదా పిన్నీ. నువ్వు రెస్ట్ తీసుకో. నా ఒక్కడి కోసం ఏం వండుతావు? మధ్యాహ్నం మిగిలిన అన్నం ఉంటే పెరుగేసుకుని తినేస్తాలే'' అన్నాను.

''మిగిలిన అన్నం పని మనిషి పట్టుకెళ్ళిపోతుంది. వంట నీ ఒక్కడికేనా.... నేను తినొద్దా... బాగా ఆకలేస్తోంది కూడా'' అంది నవ్వుతూ.

''అదేంటి? వాళ్ళింట్లో వంటలు చేశావుగా, తిని రాలేదా?''

''పాపం తినమనే అన్నారు. నాకే అలవాటు లేదు. ఎక్కడ వంటలు చేసినా మళ్ళా నా ఇంటి కొచ్చి వండుకుని తింటే తప్ప తృప్తిగా ఉండదు. ఐనా వాళ్ళకి సాయం చేయడానికని వెళ్ళి తినేసి వస్తే ఏం బావుంటుంది చెప్పు? సాయంలో ఎప్పుడూ బదులు కోరకూడదు అనేవాడు ఈయన బతికున్న రోజుల్లో'' అంది.

భోజనాలయ్యాక పెరట్లో మంచాలు వేసింది. మాటల సందర్భంలో తన భర్తకు సంబంధించిన విషయాలు చెప్పింది.

''పరిపూర్ణమైన జీవితం అంటే నిండా నూరేళ్ళు బతకటం కాదని ఈయన అనేవాడు. బతికినన్నాళ్ళు పదిమందికి చాతనైన సాయం చేస్తూ, అందర్నీ ప్రేమిస్తూ వాళ్ళ చేత ప్రేమించబడ్తూ ఆత్మీయతల్తో అనుబంధాల్తో పెనవేసుకున్న జీవితమే నిండైన జీవితం అనేవాడు. పంటపొలాలకి ఎరువులు కొంటానికని వెళ్ళి తిరిగొస్తూ యాక్సిడెంట్లో చనిపోయే రోజు వరకు...బతికినన్నాళ్ళు ఆయన అలానే బతికాడు. నేనూ అలానే బతుకుతున్నాను. నాకంటూ పెద్దగా కోరికలంటూ ఏమీ లేవు. చనిపోయే క్షణం వరకు ఇలా సాటి మనిషిని ప్రేమిస్తూ వాళ్ళ అభిమానంలో తనివితీరా తడిసి పోవాలని''

ఎంత పిచ్చిదో... తను ప్రేమిస్తోంది నిజమే... వాళ్ళ చేత నిజంగా ప్రేమించబడ్తోందా అనేదే అనుమానం...

ఉదయం లేచి టిఫిన్ చేసి పెట్టాక, ''పార్వతమ్మ రమ్మంది. కూతురికి సారె పంపాలట. పిండివంటలు చేయాలి. ఆ పిల్ల నాకూ తెలుసు. అత్తారి ఊరు రాజమండ్రి.'' అంది వెళ్ళబోయే ముందు ''బోర్ కొడ్తుందేమో సినిమాకెళ్ళకూడదూ'' అంది.

నేనున్న రెండ్రోజుల్లో పచ్చళ్ళు పెట్టాలని ఓసారి, ఎదురింట్లో మామ్మగారికి సుస్తీ చేసిందని మరోసారి బైటికెళ్ళింది.

నేను తిరుగు ప్రయాణమైన రోజు ''నువ్వొచ్చిన పని సానుకూలమైందా బాబు... నేనే నీతో ఎక్కువ సమయం గడపలేకపోయాను. మరోలా అనుకోవుగా'' అంది తప్పు చేసిన దానిలా తలవొంచుకుంటూ.

''నేనొచ్చిన పని దివ్యంగా పూర్తి చేసుకొని వెళ్తున్నాను పిన్నీ. థాంక్స్'' అన్నప్పుడు సిగ్గు పడిపోయింది.

## మానవతా జాతికోసం



మంచితనం, మానవత్వం నిండిన మనుషులు అతికొద్దిమంది మాత్రమే మిగిలి ఉన్నారని, వాళ్ళని కాపాడుకోవటంతో పాటు ఆ జాతి అభివృద్ధి చెందేలా పాటు పడక పోతే, ఆ జాతి మొత్తం అంతరించిపోయే ప్రమాదముందని హెచ్చరిస్తూ రాసిన నా కథ ''ప్లాట్ ఫాం పిన్ని''కి ఉగాది కథల పోటీలో ప్రథమ బహుమతి రావటం సంతోషంగా ఉంది. సాహిత్యంలోకి ఎన్ని వాదాలు వచ్చినా మానవతావాదాన్ని మించింది లేదని నా నమ్మకం. మానవత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెల్పుతూ రాసిన నా కథకు బహుమతి రావటం ఆ నమ్మకాన్ని మరింత పెంచింది.

-సలీం

9849386327

హైదరాబాద్ తిరిగొచ్చిన వారానికి ఆరో తరగతి చదువుతున్న నా కూతురు నీహ టీవీలో చూపించిన కోపెన్ హాగన్ సదస్సు చివరి రోజు విశేషాలు చూసి "నాన్నగారూ...అంతరించి పోతున్న జాతులంటే ఏమిటి?" అని అడిగింది.

"మనిషి తన స్వార్థం కోసం పర్యావరణాన్ని కలుషితం చేయడం వల్ల జంతువుల్ని ఆహారం కోసమో, ఆదాయం కోసమో విచక్షణారహితంగా చంపటం వల్ల కొన్ని జీవజాతులు నశించిపోయే ప్రమాదం ఏర్పడింది. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీద ఉందమ్మా" అన్నాను.

"ఏమిటవి?"

"పులులూ, ఏనుగులు, ఖడ్గమృగాలు...బట్టమేక పక్షులు..." అని కొంత విరామం తర్వాత చెప్పాను "ప్లాట్ ఫాం పిన్ని కూడా."

నీహ తన వెడల్పాటి కళ్ళని విప్పార్చి "నాకర్థం కాలేదు నాన్నగారు. ప్లాట్‌ఫాం పిన్నెవరు?" అంది.

"చాలా వేగంగా అంతరించిపోతున్న జాతమ్మా. ఇన్ని కోట్ల జనాభాలో పిడికెడంత మందే మిగిలున్నారు. వాళ్ళని కాపాడుకోవాల్సిన బాధ్యతతో పాటు ఈ జాతి వృద్ధి చెందేలా కృషి చేయాల్సిన బాధ్యత మన మీదుంది. లేకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం పొంచి ఉందమ్మా" అన్నాను.

*

## పరపరాగంలోకి...

కవిత




ప్రతిరాత్రి
రెండోజాము చివరకానుకుని
అన్ని తావీజుల్ని విప్పి అవతల పారేసి
ఆత్మను అరచేతిలోకి తీసుకుని లాలించుకుంటూ
మధ్య మధ్య నన్ను నేను చిక్కుతీసుకుంటూ
పగలంతా వేసుకున్న అనుభవాల ధూపంలో
ఏదైనా రహస్య సందేశం
దాగిఉందేమోనని వెదుక్కుంటుంటే....

మెరుపుల ఉరకలతో ఎంతకీ చిక్కని
చేపపిల్లల్లాంటి పగటితనాల పరిష్వంగంలో
ఎంతసేపటికీ గొంతులో ఒదగని గరళాన్ని
పుక్కిటపట్టి, కాలుతున్న ఊపిరి మీదకు
బలంగా విసురుకున్న వలను
దగ్గరగా లాక్కుని కుమ్మరించుకుంటే.....

పిట్టలు ఉలిక్కిపడి లేచిన చెట్టులా
గదిగదంతా –
తెగిపడిన అంతర్నాడుల దొంతరల నడుమ
నిదుర వర్ణాలన్నిటినీ నరికేస్తున్న
తెంపరి మెలకువలో బిత్తరపోతుంటే...

అప్పటిదాకా, సమ్మోహనాంతరంగం పేర్చుకున్న
లౌల్యమంతా ఇంకిపోయి
*Beingness of nothing* లో
*Nothingness of being* లో
అసలు సిసలు నగ్నత్వంలో
అక్కడంతా నేనే నిఖార్సయిన నేనే

***

రెక్కలు చాచుకుని
వలస వలసకూ కాస్త పోగొట్టుకుని
ఎగిరిపోయిన తీరాల నుంచి

వెనక్కి వచ్చి రెక్కలు ముడుచుకున్నాక
అన్నన్ని విహ్వలతల కొసన
ప్రశ్నల్లోంచి ప్రశ్నల్లోకి ఒత్తిగిల్లుత్తున్న
రాత్రి సంపుటిలో
ఈ నిశ్శబ్ద శబ్దవనాల్ని కప్పెట్టుకోవడానికి
ఎన్ని పెగ్గుల మట్టిని ఎత్తిపోయాలి
సర్దుబాటు పరదాల వెనుక అన్వయాలకందని
ఒంటరితనాన్ని తలకెత్తుకు సాగటానికి
ఎన్ని అక్షరాల గంపల్ని మోయాలి

నా పిచ్చిగానీ,
ఏమరుపాటుగా ఉన్నప్పుడు ఎదురై
ఎప్పుడో ఒక మల్లెమొగ్గను విసిరేసి
నేను నవ్వి పలకరించేలోపే
పేలిపోయిన ఆ కాసిన్ని నక్షత్రక్షణాల బిలాల్లోంచి
నాలోకి వెళ్లేందుకు నాకెందుకీ వెదుకులాట...
ఊగిసలాట..?

చచ్చీచెడీ వెళ్లాక
రెక్కపట్టుకుని లాగి కుదేసుకున్న
అగాథాలు నెమరేసుకుంటున్న
గతాల మగతలోంచి కూడదీసుకుని
మరచిపోయిన ఆత్మీయతల్లోకి
మళ్లీ ఓ ఉత్తరం ముక్కై ప్రవహిద్దామనుకుంటే
చివికిపోయిన చిరునామా
చివరి సంతకం దారుల్ని తప్పించేస్తోంది

కోతకొచ్చిన పంట నడుమ
కొరివిమంట కొలువుదీరినట్లు –
పసుపాకుపచ్చ మడిలా మిసమిసలాడాల్సిన
పగలంతా
పొగచూరిన పదచిత్రమైపోతుంటే...
ఊపిరి పొలమారిపోయి
బొక్కబోర్లాపడి బొప్పికట్టిన పొద్దుల్ని
బాకీపడ్డ పద్దుల్లా చంకనెట్టుకుపోతున్న
చెల్లుబాట్ల రాట్నంలో
ఏ ఎక్కంతో కొలుచుకోవాలో
ఏ రెప్పలవాకిలీ చెప్పలేకపోతుంటే...

నేనేమిటో తెలిసీ
దగా చేసిపోతున్న రాత్రి ఒడ్డున
మూడంకెపడని మూడోజాము మీద గద్దలా వాలే
*Objective abstractiveness* లో
నాకు నేనే ఏమాత్రం పరిచయం లేని
ఒక *obsurd caricature*... లా
విరిగిపడిన ఇంద్రచాపపు నారి నుంచి
రాలిపడుతున్న *agonical meloncholy*.... లా

***

అన్ని ఆచ్ఛాదనల్నీ ఒలిచేసుకున్నాక
ఏ వర్ణమూ
నారుమడికి నాట్యరీతి నేర్పిన పిల్లతెమ్మెర కాలేక
నీలుగుతున్న నాలుగోజాము మీద
ఘనీభవించిపోయి...
అప్పటికిక యుద్ధభూమి ఆ కొసన
దాటిపోతున్న చివరి సైనికుడిలా
నన్నక్కడే అద్వైతంలోకి పాతరేసుకున్నాక
ఎప్పటికో కళ్లల్లో వత్తులన్నీ కొండెక్కిపోతాయి

అప్పటిదాకా గుక్కపట్టిన
నాలుగు గోడల నడుమ రేగిన
అల్పపీడనంలో గుటకలు మింగుతూ –
సుడులు తిరిగి తిరిగి ఎక్కడో జారిపడి
ఎటో కొట్టుకుపోయిన హృదయాన్ని
పట్టి పట్టి ఏరుకుని లోపల కుక్కేసుకుని
చిలకజోస్యం చెప్పే కాలాన్ని
జోలెగా తగిలించేసుకుని
గుప్పెడు నవ్వుల్ని గచ్చకాయల్లా ఎగరేసుకుని
ఎవరి చూపుల కొలబద్దల్లోనో
ఒదగడానికి నన్ను కుదించుకుంటూ
ఇంకెన్నో నమ్మకద్రోహాల్ని దీవించుకుంటూ
పోవాల్సిన
పరపరాగంలోకి –

వేల వేల పగుళ్ల తీపులకు
హడావిడిగా అంజనం రాసేసుకుని
మడతబడి బెణికిన
అంతరంగాన్ని సవరదీసుకుంటూ
గుణింతాలు, భాగహారాల మధ్య బోల్తాపడిపోయే
బోళాతనానికి బోలెడన్ని
మలాంపట్టీలతో మళ్లీ నేను....

ఎప్పుడూ తప్పే లెక్కల్ని
ఏరి కుప్ప పెట్టుకోవడానికి
సరికొత్త వేదిక మీదకు –
గంధపు వాసనలు చిమ్ముతున్న
గండునవ్వుల్ని పోతపోసుకున్న
శరణార్థిలా నేను...
పదహారణాల పగటివేషంతో నేను...

**– యార్లగడ్డ రాఘవేంద్ర రావు**